క్లుప్తంగా

స్పోర్ట్స్ స్కూల్స్ ఎంపికకు శిక్షణ

నారాయణపేట రూరల్ : స్పోర్ట్స్ స్కూల్‌లో చదువుకునేందుకు ఉత్సాహం కల్గిన విద్యార్థులకు అర్హత పరీక్షకు హాజరయ్యేందుకు అవసరమైన శిక్షణను ఉచితంగా అందిస్తున్నట్లు అథ్లెటిక్స్ కార్యదర్శి రమణ, కోశాధికారి అంబరీష్ తెలిపారు. 4, 5వ తరగతి చదువుకునే బాల, బాలికలు సోమవారం నుంచి ఉదయం 6 నుంచి 7.30గంటల వరకు, సాయంత్రం 5గంటల నుంచి 6.30గంటల వరకు స్థానిక మినీ స్టేడియం గ్రౌండ్‌లో శిక్షణకు హాజరు కావాలన్నారు. మరిన్ని వివరాలకు 8499968852ను సంప్రదించాలన్నారు.

నేడు విద్యా సంస్థల బంద్

నారాయణపేట రూరల్ : ప్రభుత్వ పాఠశాలల్లో నెలకొన్న సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ సోమవారం విద్యాసంస్థల బంద్ నిర్వహిస్తున్నట్లు ఏబీవీపీ జిల్లా కన్వీనర్ నరేష్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో వసతులు కల్పించడంలో బీఆర్ఎస్ ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని, పర్యవేక్షణ అధికారుల పోస్టులు లేక విద్యా సంస్థలు ఇష్టారీతిగా తయారయ్యాయని, అనుమతులు లేని ప్రైవేటు పాఠశాలలపై చర్యలు తీసుకోవాలని, అధిక ఫీజుల వసూలును అరికట్టాలని డిమాండ్ చేశారు. జిల్లాలోని అన్ని ప్రభుత్వ, ఎయిడెడ్, ప్రైవేటు పాఠశాలలు బందుకు సహకరించాలని కోరారు.

రేపు ఆర్టీసీ డిపోలో రక్తదాన శిబిరం

నారాయణపేట రూరల్ : ప్రమాద సమయంలో ఎంతో మందికి రక్తం దొరకక మృతిచెందుతున్నారని, వారికి ఉడతాభక్తి సహకారం అందించాలనే లక్ష్యంతో ఆర్టీసీ డిపోలో రక్తదాన శిబిరం ఏర్పాటు చేస్తున్నట్లు డిపోమేనేజర్ ఆంజనేయులు తెలిపారు. ఈ నెల 27 మంగళవారం ఉదయం 9.30గంటల నుంచి మధ్యాహ్నం 3గంటల వరకు డిపో ఆవరణలో ఆర్టీసీ ఉద్యోగులు, కార్మికులు, వారి కుటుంబ సభ్యులు, స్నేహితులు పెద్ద సంఖ్యలో హాజరై రక్తదానం చేయాలన్నారు. కళాశాల విద్యార్థులు సైతం ముందుకు రావాలని కోరారు. రక్తదానం చేసిన వారికి ధ్రువపత్రం అందిస్తామన్నారు.

ఉచిత వైద్య శిబిరం

నారాయణపేట రూరల్ : పట్టణంలోని 9వ వార్డులోని ఎంబీ హైస్కూల్ ఆవరణలో ఆదివారం గీతా ఆస్పత్రి ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ గీత, డాక్టర్ విశ్వనాథ్‌లు హాజరై పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు అందించారు. గర్భిణీ స్త్రీలకు సలహాలు, సూచనలు చేశారు. 300మంది హాజరైనట్లు తెలిపారు. కార్యక్రమంలో ఈశ్వరమ్మ, నర్మద, శాంత, సునీల్, భరత్, స్నేహ, అమృత పాల్గొన్నారు.

కౌశిక్‌రెడ్డి దిష్టిబొమ్మ దహనం

మరికల్: ఎమ్మెల్సీ కౌశిక్‌రెడ్డి ముదిరాజ్‌లపై చేసిన అనుచిత వ్యాఖ్యలకు నిరసనగా ఆదివారం ఆయన దిష్టిబొమ్మను దహనం చేశారు. మరికల్ మండల ముదిరాజ్ సంఘం ఆధ్వర్యంలో గజ్జలమ్మ దేవత ఆలయం నుంచి శవయాత్ర నిర్వహించి చౌరస్తాలో కౌశిక్‌రెడ్డికి వ్యతిరేకంగా నినాదలు చేశారు. ముదిరాజ్ సంఘం నాయకులు నారాయణ, కొండయ్య, సతీష్, రామకృష్ణ, శ్రీను, కృష్ణయ్య, రఘు, మొగులప్ప, ఆంజనేయులు పాల్గొన్నారు.


విద్యార్థులకు సర్టిఫికెట్లు అందజేత

మద్దూరు: మండల కేంద్రంలోని భాస్యం పాఠశాలలో వేసవి కాలంలో ఎస్‌వీఎస్ టెక్నాలజీస్ ఆధ్వర్యంలో ఐదో తరగతి నుంచి ఆపై తరగతుల విద్యార్థులకు 45 రోజుల పాటు నిర్వహించిన ఉచిత కంప్యూటర్ శిక్షణ సర్టిఫికెట్లను నిర్వాహకులు వేణు, సాయిలు, భరత్, రఘు ఆదివారం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ 85 మంది విద్యార్థులు ఆన్‌లైన్ పరీక్షలో 50 శాతం మార్కులు సాధించడంతో వారికి పీజీడీసీఏ కంప్యూటర్ కోర్సుకు సంబంధించిన సర్టిఫికెట్లను అందజేశామన్నారు.

ఉద్యమనేత డీవీకృష్ణ

దామరగిద్ద: విప్లవ కార్మిక ఉద్యమానికి తన జీవితాన్ని ధారపోసిన నేత సీపీఐ(ఎంఎల్) ప్రజాపంథా మాజీ రాష్ట్ర కార్యదర్శి డీవీకృష్ణ అని పీడీఎస్‌యూ రాష్ట్ర అధ్యక్షుడు రామకృష్ణ, సీపీఐ ప్రజాపంథా నాయకుడు రాము, ఉదయ్ అన్నారు. ఆదివారం మండలంలోని ఉడ్మల్‌గిద్దలో ఆయన వర్ధంతి సందర్భంగా చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఆయన సేవలను కొనియాడారు. కార్యక్రమంలో తాయప్ప, ఆశప్ప, నర్సింహా, రవి, శంకర్ పాల్గొన్నారు.

వర్కటం ఔదార్యం



మక్తల్: పట్టణంలోని తొమ్మిదవ వార్డుకు చెందిన బాబాకు సంబంధించిన ఇల్లు కొద్ది నెలల క్రితం కూలిపోయింది. ఆయన ఆర్థిక పరిస్థితి సరిగా లేకపోవడంతో వెంటనే బీఆర్ఎస్ నాయకుడు వీజేఆర్ ఫౌండేషన్ అధినేత వర్కటం జగన్నాథ్‌రెడ్డి సొంతంగా రూ.75లతో ఇంటి నిర్మాణం చేపట్టారు. ఈ ఇంటిని ఆదివారం ఆయన ప్రారంభించారు. జగన్నాథ్‌రెడ్డికి తాము రుణపడి ఉంటామని బాబా కుటుంబ సభ్యులు తెలియజేశారు.

ప్రమాదకరంగా బావులు

- రోడ్లపై కానరాని రక్షణ గోడలు, బోర్డులు
- ఇబ్బందులు పడుతున్న వాహనదారులు
- పట్టించుకోని అధికారులు



అడవిసత్యారం-కోల్పూర్ మధ్య ప్రమాదకరంగా బావి

మాగనూర్: అసలే ఇరుకైన రోడ్లు ఆపై మూల మలుపులు.. రోడ్లను కమ్మేసిన కంపచెట్లు.. వాటి మాటున ప్రమాదకరమైన బావులు. దీంతో ఆ దారి గుండా వెళ్లాలంటే ఎప్పుడు ఏ ప్రమాదం జరుగుతుందోనని వాహనదారులు ఆందోళన చెందుతున్నారు. మండలంలోని అడవిసత్యారం - కోల్పూర్, కోల్పూర్-మందిపల్లి గ్రామాలకు వెళ్లే ప్రధాన రహదారులకు ఆనుకొని బావులు ప్రమాదకరంగా ఉన్నాయి. కానీ వాటికి ఎలాంటి రక్షణ చర్యలు తీసుకోలేదు. దీంతో వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.

కానరాని రక్షణ గోడలు, బోర్డులు..

మండలంలోని గ్రామీణ ప్రాంతాలకు రూ.కోట్ల వ్యయంతో ప్రభుత్వం బీటీ రహదారులు నిర్మించింది. కానీ రహదారుల పక్కనే ఉన్న ప్రమాదకరమైన బావులకు మాత్రం రక్షణ గోడలు నిర్మించడం మరిచిపోయారు. అంతేగాక ఆ బావుల వద్ద కనీసం హెచ్చరిక బోర్డులు కూడా ఏర్పాటు చేయలేదు. దీంతో ఎప్పుడు ఏ ప్రమాదం జరుగుతుందో తెలియక వాహనదారులు, ప్రయాణికులు ఆందోళన చెందుతున్నారు. బావులు ఉన్న ప్రదేశంలో ఎదురెదురుగా వాహనాలు వస్తే ప్రమాదాలు చోటుచేసుకునే అవకాశాలు ఎక్కువగా ఉన్నాయి. ఒక చోట రోడ్డుకు ఇరువైపులా బావులు ఉన్నాయి.

రోడ్డుకు ఇరువైపులా..



బావి సమీపంలో ఉన్న మూలమలుపు

అడవిసత్యారం-కోల్పూర్ రహదారిపై రోడ్డుకు ఇరువైపులా రెండు పెద్ద పెద్ద బావులు ఉన్నాయి. బావులు ఉన్న ప్రదేశాల్లో పెద్ద మూలమలుపులు ఉండటంతో దగ్గరకు వచ్చే దాకా కనిపించవు. వీటిని కంపచెట్లు కమ్మేయడంతో బావులు ప్రమాదకరంగా మారాయి. ఈ రహదారులపై నిత్యం పాఠశాలల, ఆర్టీసీ బస్సులు, ఆటోలు, ట్రాక్టర్లు, ద్విచక్ర వాహనాలు ప్రయాణం సాగిస్తుంటాయి. సింగిల్ రోడ్డు కావడంతో ఎదురెదురుగా వాహనాలు వస్తే ఇబ్బందికరంగా ఉంటుంది. రోడ్డుపై మేతకు వెళ్లే పశువులు ఒకదానితో మరొకటి పొట్లాడుకుంటూ బావుల్లో పడిన ఘటనలు ఉన్నాయి. అధికారులు స్పందించి బావులకు రక్షణ గోడలను ఏర్పాటు చేయాలని పలువురు కోరుతున్నారు.

రక్షణ గోడలు నిర్మించాలి



రహదారిపై అడవిసత్యారం సమీపంలో రోడ్డు పక్కన ఉన్న బావులు ప్రమాదకరంగా ఉన్నాయి. మూలమలుపులతో పాటు బావులు ఉన్న ప్రదేశాల్లో కంపచెట్లు రోడ్డును కమ్మేశాయి. దీంతో దగ్గరకు వచ్చేదాకా బావులు ఉన్న సంగతి తెలియదు. వాహనం వచ్చినప్పుడు ఏ ప్రమాదం జరుగుతోందో అని భయం వేస్తుంది. కంపచెట్లను కొట్టేసి, రక్షణ గోడలను నిర్మించాలి.

– ప్రకాశ్‌రాజు, కోల్పూర్

రెండు రోజుల్లో ఏర్పాటు చేస్తాం..



రహదారి వెంబడి బావులు ఉన్న మాట వాస్తవమే. ఈ విషయంపై సంబంధిత సిబ్బందికి ఇప్పటికే సూచనలు ఇచ్చాం. ఎక్కడైతే ప్రమాదకర బావులు ఉన్నాయే వాటి దగ్గర రక్షణ గోడలు, బోర్డులు రెండు రోజుల్లో ఏర్పాటు చేసి ప్రమాదాలను నివారిస్తాం.

– అంజనేయులు, ఏఈ, పంచాయతీ రాజ్

పశువుల అక్రమ రవాణా చేస్తే చర్యలు

మాగనూర్: బక్రీద్ సందర్భంగా కర్ణాటక ప్రాంతం నుంచి మండల కేంద్రం మీదుగా మాహబూబ్‌నగర్, హైదరాబాద్ లాంటి ప్రాంతాలకు పశువుల అక్రమ రవాణా చేసే అవకాశం ఉండడంతో ఎస్పీ వెంకటేశ్వర్లు ఆదేశాల మేరకు మాగనూర్ నల్లగట్టు మారెమ్మవ్వ వద్ద స్పెషల్ చెక్‌పోస్టు ఏర్పాటు చేసినట్లు ఎస్ఐ మల్లేష్ అన్నారు. ఆదివారం కర్ణాటక ప్రాంతం నుంచి వచ్చిన వాహనాల తనిఖీ నిర్వహించారు. బక్రీద్ సందర్భంగా ఎవరైన పశువులను అక్రమంగా తరలిస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. అదే విధంగా బక్రీద్ పండుగ శాంతియుతంగా జరిగేందుకు ప్రతి ఒక్కరూ సహకరించాలని కోరారు.



నల్లగట్టు వద్ద చెక్‌పోస్టు ఏర్పాటును పరిశీలిస్తున్న ఎస్ఐ మల్లేష్

యువతి ఆత్మహత్య

కృష్ణా: ఓ యువతి ఇంట్లోనే ఆత్మహత్యకు పాల్పడింది. ఈ సంఘటన మండలంలోని హిందూపూర్‌లో ఆదివారం చోటుచేసుకుంది. ఆ వివరాలు... హిందుపూర్ గ్రామానికి చెందిన యువతి టోని(17) ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఆదివారం సాయంత్రం 7గంటలకు ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడింది. మృతికి గల కారణాలు తెలియలేదు. ప్రస్తుతం ఆమె మృతదేహాన్ని మక్తల్ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించి, పోస్టుమార్టం గదిలో ఉంచారు. ఈ సంఘటనపై ఎలాంటి ఫిర్యాదు అందలేదని పోలీసులు తెలిపారు.

ఘనంగా పూర్వ విద్యార్థుల సమ్మేళనం



ఆత్మీయ సమ్మేళనంలో పాల్గొన్న పూర్వ విద్యార్థులు

ఊట్కూర్: మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల ఆవరణలో ఆదివారం 1991–92 విద్యా సంవత్సరంలో పదో తరగతి చదివిన పూర్వ విద్యార్థులు ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. తమకు విద్య నేర్పిన గురువులు కొల్లూర్ లింగారెడ్డి, వెంకట్రాములుకు శాలువ, పూలమాలలతో సత్కరించి ఆశీర్వాదం తీసుకున్నారు. 31 ఏళ్ల తర్వాత పూర్వ విద్యార్థులు ఒకే వేదిక వద్ద కలుసుకొని అలనాటి తీపి జ్ఞాపకాలను నెమరు వేసుకున్నారు. పూర్వ విద్యార్థిని రాధామురళి కుమార్తె వర్షిణి పాడిన జానపద పాటలు ఆకట్టుకున్నాయి. సమ్మేళనంలో మిత్రబృందం ఆధ్వర్యంలో సేవా కార్యక్రమాలు చేపట్టాలని తీర్మానించారు. కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు అరవింద్ కుమార్, రాఘవేందర్‌రెడ్డి, బాల్‌రాజ్, అశోక్ కుమార్, గురునాథ్, అరుణ, సుమిత్ర, వసుంధర తదితరులు పాల్గొన్నారు.

బకాయి బిల్లులు ఇవ్వకుంటే ధర్నా

కోస్గి: నాలుగేళ్ల క్రితం పట్టణంలో ట్యాంకర్ల ద్వారా నీటిని సరఫరా చేసినా.. అధికారులు నేటికీ బిల్లులు ఇవ్వకుండా వేధిస్తున్నారని, ఇదే విషయమై పలుమార్లు జిల్లా అధికారులకు ఫిర్యాదు చేసిన పట్టించుకోవడం లేదని బాధితుడు వెంకట్‌నర్సిములు ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ఇంతకాలం మున్సిపల్ అధికారులు, పాలకవర్గం ఒకరిపై ఒకరు చెబుతూ కాలయాపన చేశారని వాపోయారు. చివరకు మున్సిపల్ కౌన్సిల్‌లో తీర్మానం చేసినా జిల్లా అధికారులు బిల్లులు ఇవ్వడం లేదన్నాడు. రూ.లక్షలు ఖర్చు చేసి తాగునీరు సరఫరా చేశామని, బిల్లులు ఇవ్వకుంటే స్థానిక మున్సిపల్ కార్యాలయం ఎదుట ధర్నా చేస్తానన్నారు. ఈ విషయంలో కలెక్టర్ సమగ్ర విచారణ జరిపి తనకు రావాల్సిన నీటి ట్యాంకర్ల బిల్లులు ఇప్పించాలని బాధితుడు కోరాడు.

బీజేపీ అధికారంలోకి రావడం ఖాయం

మరికల్: రాబోవు ఎన్నికల్లో రాష్ట్రంలో బీజేపీ అధికారంలోకి రావడం ఖాయమన్ని ఆ పార్టీ జిల్లా నాయకులు దేవేందర్‌గౌడ్ అన్నారు. మహాజన్ సంపర్క్ అభియాన్‌లో భాగంగా మండలంలోని పెద్దచింతకుంటలో ఆదివారం ఇంటింటి ప్రచారం నిర్వహించి కేంద్ర ప్రభుత్వం చేపట్టిన పథకాలను ప్రజలకు వివరించారు. నాయకులు అశోక్, జగదీశ్, మల్లేష్, పరశురాం, సంజీవ శివకుమార్ పాల్గొన్నారు.

దామరగిద్ద: కేంద్ర ప్రభుత్వ పథకాలపై అన్నాసాగర్‌లో ఆదివారం ఇంటింటి ప్రచారం నిర్వహించారు. భీములు, నర్సింహులు కార్యకర్తలు పాల్గొన్నారు.

కోస్గి: రానున్న ఎన్నికల్లో కేంద్రంలో, రాష్ట్రంలో బీజేపీ అఖండ విజయం సాధిస్తుందని మేధావుల ఫోరం జిల్లా కన్వీనర్ డాక్టర్ బాల్‌నర్సయ్య అన్నారు. మహా సంపర్క్ అభియాన్‌లో భాగంగా ఆదివారం పట్టణంలోని పలు కాలనీల్లో బీజేపీ చేపట్టిన ఇంటింటి ప్రచారంలో పాల్గొని దేశాభివృద్ధికి మోదీ అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను వివరించారు. గందె వెంకటయ్య, నాగులపల్లి వెంకట్రాములు, ఓబీసీ కో కన్వీనర్ తాండ్ర నరేష్, తమ్మలి బలరామకృష్ణంరాజు పాల్గొన్నారు.

ఆర్‌ఎంపీలు ప్రథమ చికిత్స మాత్రమే చేయాలి



మక్తల్‌లో డాక్టర్లను సన్మానిస్తున్న ఆర్‌ఎంపీలు

మక్తల్: ఆర్‌ఎంపీలు ప్రథమ చికిత్స మాత్రమే చేయాలని ప్రముఖ గైనకాలజిస్ట్ అక్షిత అన్నారు. ఆదివారం పట్టణంలో గ్రామీణ వైద్యసేవకుల సంఘం ఆధ్వర్యంలో అవగాహన సదస్సు నిర్వహించారు. అనంతరం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆమె మాట్లాడుతూ ఆర్‌ఎంపీలు గ్రామాల్లో చేస్తున్న సేవలను కొనియాడారు. ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా చికిత్సలు చేయరాదన్నారు. ఆర్‌ఎంపీ డాక్టర్ అక్షితరెడ్డితో పాటు మణివర్ధన్‌రెడ్డిని శాలువాతో సన్మానించారు. కార్యక్రమంలో ఆర్‌ఎంపీల జిల్లా అధ్యక్షుడు సిద్రామేశ్వర్, మండల అధ్యక్షుడు చక్రధర్, ఆర్‌ఎంపీలు ఆశప్ప, వెంకటేష్, శంకర్, మనోహర్‌లాల్, రుకియాబేగం తదితరులు పాల్గొన్నారు.

కర్ణాటక రహదారికి తెలంగాణ వాసుల మరమ్మతు

దామరగిద్ద: మండల సరిహద్దులోని కర్ణాటక రాష్ట్ర సరిహద్దు రహదారి గుంతలు పడి ప్రమాదకరంగా మారిన నేపథ్యంలో ఆదివారం విఠలాపూర్ సర్పంచ్ నిర్మల, పరుశురాంరెడ్డి, వైస్ ఎంపీపీ దామోదర్‌రెడ్డి బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు ఆశన్న సమక్షంలో మరమ్మతు చేపట్టారు. రహదారి గుంతలమయంగా మారడంతో ప్రమాదాలు చోటుచేసుకుంటున్నాయని గ్రామ నాయకులు సెడెం ఎమ్మెల్యే, కర్ణాటక రాష్ట్ర విద్యా వైద్య శాఖ మంత్రి శరణప్రకాశ్‌కు విన్నవించారు. అయినా స్పందించకపోవడంతో చర్యలు చేపట్టారు. మరమ్మతుకు సంబంధించిన ఫొటోలు మంత్రికి పోస్ట్ చేయగా స్పందించి ఏఈని పరిశీలనకు పంపారని దామోదర్‌రెడ్డి వివరించారు.



మట్టి వేయిస్తున్న విఠలాపూర్ నాయకులు

తిరుగులేని శక్తిగా బీఆర్ఎస్

దామరగిద్ద: బీఆర్ఎస్ రాష్ట్రంలో చేపట్టిన అభివృద్ధి, సంక్షేమ పథకాలతో అందరిని ఆకర్షించిందని, తిరుగులేని శక్తిగా ఎదిగిందని ఎమ్మెల్యే ఎస్. రాజేందర్‌రెడ్డి అన్నారు. మండలంలోని ఉడ్మల్‌గిద్దలో పంచాయతీ భవనం శంకుస్థాపన అనంతరం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో మాట్లాడారు. ఈ సందర్భంగా పార్టీ నాయకుడు వెంకట్‌రెడ్డి ఆధ్వర్యంలో సీపీఎం, కాంగ్రెస్ తదితర పార్టీలకు చెందిన బాల్‌చందర్, వెంకటప్పలతో పాటు 30 మంది ఎమ్మెల్యే సమక్షంలో పార్టీలో చేరారు. వారికి ఎమ్మెల్యే కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. అంకిత భావంతో పనిచేసే వారికి పార్టీ అండగా నిలుస్తుందన్నారు. కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షుడు ఆశన్న, భీమయ్యగౌడ్, బాల్‌చందర్‌రెడ్డి, వెంకట్‌రెడ్డి, భీంషప్ప తదితరులు పాల్గొన్నారు.



పార్టీలో చేరిన సీపీఎం నాయకులు

బాధిత కుటుంబానికి పరామర్శ



బాధిత కుటుంబాన్ని పరామర్శిస్తున్న ఎమ్మెల్యే నరేందర్‌రెడ్డి

కోస్గి: రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన పెద్ద కిష్టప్ప కుటుంబాన్ని ఎమ్మెల్యే నరేందర్‌రెడ్డి ఆదివారం పరామర్శించారు. మండలంలోని ముంగిమళ్ల మదుగోని బావులకు చెందిన పెద్ద కిష్టప్ప ఈ నెల 23న వికారాబాద్ జిల్లా పరిగి సమీపంలో జరిగిన రోడ్డు ప్రమాదంలో మృతి చెందాడు. విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే ఆదివారం ముంగిమళ్ల గ్రామానికి వచ్చి బాధిత కుటుంబ సభ్యులను ఓదార్చారు. జీవనోపాధి కోసం హైదరాబాద్‌లో ఉంటూ కుటుంబాన్ని పోషించేవాడని, ఇంటి పెద్దదిక్కును కోల్పోయామని మృతుడి కుటుంబ సభ్యులు ఎమ్మెల్యే దృష్టికి తీసుకొచ్చారు. దీంతో పిల్లలను గురుకుల పాఠశాలల్లో చేర్పించడం, పార్టీ సభ్యత్వం కింద వచ్చే బీమా డబ్బులతో పాటు ప్రభుత్వ పరంగా సాయం అందేలా కృషి చేస్తానని ఎమ్మెల్యే భరోసానిచ్చారు. కార్యక్రమంలో సర్పంచ్ లక్ష్మీఆశప్ప, నాయకులు మోహన్‌గౌడ్‌తోపాటు పలువురు ఉన్నారు.

బీరప్ప విగ్రహ ప్రతిష్ఠాపన

మరికల్: పెద్దచింతకుంట గ్రామంలో బీరప్ప విగ్రహ ప్రతిష్ఠాపన ఘనంగా నిర్వహించారు. మైలారం మల్లయ్య ఆలయ అవరణలోని కొనేరులో జలభిషేకం నిర్వహించి ఆదివారం ప్రతిష్ఠాపన చేశారు. ఈ సందర్భంగా తీర్థప్రసాదలు, అన్నదాన కార్యక్రమం నిర్వహించారు.

బదిలీలు, పదోన్నతులు చేపట్టాలి



సమావేశంలో మాట్లాడుతున్న రవికుమార్

నారాయణపేట రూరల్ : వసతుల కల్పనతో పాటు ఖాళీల కొరత తీరిస్తే ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన విద్య అందడానికి అవకాశం ఉంటుందని యూటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి రవికుమార్ అన్నారు. పట్టణంలోని ప్రభుత్వ పాఠశాలలో ఆదివారం నిర్వహించిన ఆ సంఘం జిల్లా కార్యవర్గ సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. మన ఊరు – మన బడి పథకం కింద ప్రభుత్వ పాఠశాలలను బాగుచేసే కార్యక్రమాన్ని స్వాగతిస్తున్నామని, దీనికి సమాంతరంగా భర్తీకి నోచుకోని ఖాళీలపై దృష్టి పెట్టాలన్నారు. సర్దుబాటు ప్రక్రియతో పెద్దగా ప్రయోజనం ఉండదన్నారు. ప్రక్రియ పూర్తి అయ్యే వరకు వలంటీర్లను ఏర్పాటు చేయాలన్నారు. జాతీయ విద్యా విదానాన్ని పూర్తిగా వ్యతిరేకిస్తున్నామని, ఆరోగ్య విషయంలో హెల్త్ కార్డులను అందించి అన్ని ఆస్పత్రుల్లో అమలు జరిగేటట్లు చర్యలు చేపట్టాలన్నారు. సమయానికి వేతనాలు చెల్లించి బకాయి బిల్లులను వెంటనే అందించేందుకు చర్యలు చేపట్టాలన్నారు. సమావేశంలో శివరాములు, బాలాజీ, వేణుగోపాల్, వెంకటస్వామి, జయశ్రీ, భీమయ్య, నార్యానాయక్, వెంకటేష్ పాల్గొన్నారు.

దీక్షలో పూర్వ విద్యార్థులు



నారాయణపేట రూరల్ : కోటకొండ మండల సాధన సమితి ఆధ్వర్యంలో చేపడుతున్న నిరహారదీక్షలు 47వ రోజుకు చేరుకున్నాయి. గ్రామ జెడ్పీ ఉన్నత పాఠశాలలో 1992–93 విద్యా సంవత్సరంలో టెన్త్ చదువుకున్న బ్యాచ్ విద్యార్థులు ఆదివారం దీక్షలకు హాజరయ్యారు. ఈ సందర్భంగా సాధన సమితి నాయకులు మాట్లాడుతూ.. అన్ని అర్హతలు కల్గిన రాజకీయ దురుద్దేశంతోనే ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తుందన్నారు. స్థానిక నాయకులు, ఈ ప్రాంత ఎమ్మెల్యే చొరువ తీసుకుని సీఎం కేసీఆర్‌తో ప్రకటన ఇప్పించాలని డిమాండ్ చేశారు. ఈ నెల 28న దీక్షలు 50వ రోజుకు చేరుకుంటున్న సందర్భాన్ని పురస్కరించుకుని చేపడుతున్న బహిరంగసభ కరపత్రాలను కోటకొండతో పాటు చుట్టు పక్కల గ్రామాల్లో పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వ్యాపారస్తులు, ప్రైవేటు ఉద్యోగులు, కూలీలు, విద్యార్థులను కలుసుకుని మద్దతు కోరారు. అదేవిధంగా వంటావార్పులో పాల్గొనాలని మహిళలకు పిలుపునిచ్చారు. కెంచె శ్రీనివాస్, రాము, కాశీనాథ్, చెన్నప్ప పాల్గొన్నారు.

రమేశ్‌గౌడ్ సేవలు మరువలేనివి

నారాయణపేట: సిటిజన్ క్లబ్ సీనియర్ లైఫ్ సభ్యుడు, రాష్ట్ర గౌడ సంఘం వర్కింగ్ ప్రెసిడెంట్ రమేశ్‌గౌడ్ చేసిన సేవలు మరువలేనివని క్లబ్ కార్యదర్శి వెంకట్రాములు, ఉపాధ్యక్షుడు వెంకటయ్య కోశాధికారి మనోహర్‌ప్రసాద్‌గౌడ్ అన్నారు. ఆదివారం రమేశ్‌గౌడ్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. మార్కెట్ మాజీ చైర్మన్ సరాఫ్‌నాగరాజు, క్లబ్ కార్యదర్శి రఘువీర్‌యాదవ్, పాల్గొన్నారు.

సన్మానం

ధన్వాడ: నీరటి నర్సిములు నాయుడు జిల్లా మత్స్యసహకార సంఘం డైరెక్టర్‌గా ఎకగ్రీవంగా ఎన్నిక కావడంపై ఆదివారం ధన్వాడ సంఘం ఆధ్వర్యంలో శాలువ పూలమాలతో సన్మానం చేశారు. నర్సిములు, ఆనంద్, అశోక్, మణెమ్మ, రాములమ్మ, వెంకటప్ప, రామచంద్రయ్య, కృష్ణయ్య ఉన్నారు.

పేదలకు ఇళ్ల స్థలాలు ఇవ్వాలి



దరఖాస్తులు స్వీకరిస్తున్న నాయకులు

నారాయణపేట టౌన్: పట్టణంలోని పేదలకు ఇళ్లు, స్థలాలు ఇవ్వాలని, సొంత స్థలం ఉన్న వారికి రాష్ట్ర ప్రభుత్వం రూ. ఐదు లక్షలు, కేంద్ర ప్రభుత్వం రూ. 10 లక్షలు ఇంటి నిర్మాణానికి అందించాలని నాయకులు డిమాండ్ చేశారు. సీఐటీయూ జిల్లా కన్వీనర్ బాల్‌రాం, దివ్యాంగుల హక్కుల వేదిక జిల్లా అధ్యక్షుడు కాశప్ప మాట్లాడుతూ జులై 3న కలెక్టరేట్ ఎదుట ధర్నా చేపడుతున్నట్లు పేర్కొన్నారు. ఈ మేరకు దరఖాస్తులు స్వీకరించారు. కార్యక్రమంలో పోషల్ కృష్ణ, వడ్డే సత్యప్ప, శేఖర్, పాల్గొన్నారు.

బీసీలందరికీ సాయం అందించాలి

మరికల్: రాష్ట్ర ప్రభుత్వం బీసీలందరికీ సాయం అందించాలని బీసీ ఐక్య వేదిక ఉమ్మడి జిల్లా ప్రధాన కార్యదర్శి లింగంగౌడ్ అన్నారు. మరికల్‌లో ఆదివారం ఆయన విలేకర్ల సమావేశంలో మాట్లాడుతూ రుణ సాయం పథకం కొందరికి మాత్రమే ప్రకటించడంతో బీసీలు అసంతృప్తిగా ఉన్నారని తెలిపారు. ముఖ్యమంత్రి కేసీఆర్ ప్రజలను మభ్య పెట్టడం కోసమే ఇలాంటి పథకాలను అమలు చేస్తున్నారని మండిపడ్డారు. బీసీలకు జనాబా దామాషా ప్రకారం బడ్జెట్ కేటాయించి రుణ సాయం అందించాలని కోరారు. అలగే ఎమ్మెల్సీ కౌశిక్‌రెడ్డి చేసిన అనుచిత వ్యాఖ్యలను వెంటనే వెనక్కి తీసుకొని ముదిరాజ్‌లకు క్షమాపణ చెప్పాలన్నారు. సమావేశంలో రాజు, నరేష్, విష్ణు, రాఘవేంద్ర, తిరుపతయ్య, ఆంజనేయులుగౌడ్ పాల్గొన్నారు.

సామాజిక దృక్పథం కలిగిఉండాలి



సమావేశంలో మాట్లాడుతున్న రామకృష్ణ

నారాయణపేట రూరల్: ప్రతీ విద్యార్థి చదువుతో పాటు సామాజిక అంశాలపై అవగాహన కలిగి ఉండాలని పీడీఎస్‌యూ రాష్ట్ర అధ్యక్షుడు పీ.రామకృష్ణ అన్నారు. పట్టణంలోని భగత్‌సింగ్ భవన్‌లో ఆదివారం పీడీఎస్‌యూ జిల్లా కార్యవర్గ సమావేశం నిర్వహించగా ఆయన ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. విద్యార్థులు తరగతిగదిలో పాఠ్యాంశాలకే పరిమితం కాకుండా సమాజంలో జీవన విధానంపై చైతన్యవంతం కావాలన్నారు. విద్యార్థుల హక్కులను కాపాడుకునేందుకు నిరంతరం పోరాటం చేయాలన్నారు. స్కాలర్‌షిప్పులు, ఫీజు రియంబర్స్‌మెంట్ డబ్బులను వెంటనే విడుదల చేయాలన్నారు. జిల్లా కార్యవర్గ సమావేశంలో నారాయణపేటకు సంబంధించిన సమస్యలపై తీర్మానాలు చేశారు. జిల్లాకు మంజూరైన మెడికల్ కాలేజీలో ఈ అకాడమిక్ ఇయర్‌లోనే విద్యాబోధన ప్రారంభించాలని, పీజీ సెంటర్ ఏర్పాటుకు కృషి చేయాలని, జీఓ 69ని అమలు చేయాలని, బాల, బాలికలకు బీసీ, ఎస్సీ హాస్టల్స్ ఏర్పాటు చేయాలన్నారు. మండలానికి ఒక గురుకుల హాస్టల్‌తో పాటు దరఖాస్తు చేసుకున్న ప్రతి ఒక్కరికి సీటు ఇవ్వాలన్నారు. పెరిగిన ధరలకు అనుగుణంగా మెస్, కాస్మోటిక్‌చార్జీలు పెంచి, పెండింగ్ స్కాలర్‌షిప్పు, ఫీజురియాంబర్స్‌మెంట్ నిధులు విడదల చేయాలన్నారు. సమావేశంలో సీపీఐ (ఎంఎల్) ప్రజాపంథా నాయకులు బి.రాము, పీడీఎస్‌యూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆజాద్, జిల్లా అధ్యక్షులు సాయికుమార్, కార్యదర్శి అజయ్ తదితరులు పాల్గొన్నారు.

కరాటే విద్యార్థులకు బెల్టుల ప్రదానం

మక్తల్: పట్టణంలోని డ్రాగన్ షోటో ఖాన్ కరాటే దు స్పోర్ట్స్ ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించిన పోటీల్లో ప్రతిభ కనబరిచిన కరాటే విద్యార్థులకు నారాయణపేట జిల్లా మత్స్యసహకార సంఘం అధ్యక్షుడు కోళ్ల వెంకటేష్ చేతుల మీద బెల్టులను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కరాటేను ఆత్మ రక్షణ కోసమే వినియోగించాలని విద్యార్థులకు సూచించారు. అనంతరం కోళ్ల వెంకటేష్‌ను నిర్వాహకులు సన్మానించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ 80 మంది ఎల్లో బెల్టులు, 40 మందికి గ్రీన్ బెల్టులు, 30 మందికి బ్లూ బెల్టులు, 20 మెరూన్, పది మందికి బ్రౌన్, ఐదుగురికి బ్లాక్ బెల్టులను అందజేశారు. కార్యక్రమంలో ఎండీ సలాబిన్ ఉమర్ పాల్గొన్నారు.